క్లుప్తంగా

నేడు 'వైటథాన్-2023 రన్'

రాయదుర్గం: పిల్లల్లో కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఎల్‌విప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'వైటథాన్-2023 రన్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు హెచ్‌సీయూలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంజనీకుమార్ ఈ రన్‌ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుల్లపల్లి ఎన్ రావు, ఐసైట్ యూనివర్శల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఐఔ క్యాన్సర్ ఎల్‌విపీఈఐ హెడ్ ఆఫ్ ది ఆపరేషన్ డాక్టర్ స్వాతి కలికి, ఎల్‌విపీఈఐ వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, కేఏఆర్ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ మర్లే ఫెర్నాండజ్ పాల్గొంటారు.

'సంత జరిగే ప్రాంతాలు

గచ్చిబౌలి: వారాంతపు 'సంత' నిర్వహణలో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం తారానగర్, గుల్‌మోహర్ పార్కు కాలనీ, నానక్‌రాంగూడ, మదీనాగూడ, గోకుల్‌ఫ్లాట్స్ పెద్ద చర్చి వద్ద నిర్వహిస్తారు. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే ఈ సంతలలో సరసమైన ధరలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, నిత్యావసరాలు, దుస్తులు, ఇతర వస్తువులు లభిస్తాయి.

శాంతిసరోవర్‌లో ఎంప్లాయ్ హ్యాపీనెస్ వర్క్‌షాప్

రాయదుర్గం: ఉద్యోగులు పనిలో ఆనందం కోసం చూస్తున్నారని ఎథికా ఇన్సూరెన్స్ బ్రోకర్స్ వ్యవస్థాపకుడు, ఎంప్లాయీ హ్యాపీనెస్ కోచ్ సుశీల్ అగర్వాల్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 'అన్‌లాకింగ్ ది రూటర్న్ ఆన్ హ్యాపీనెస్ ఫర్ ఎవలింగ్ వర్క్‌ఫోర్స్' అనే అంశంపై శనివారం రాత్రి ఎంప్లాయీ హ్యాపీనెస్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎథికా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ కమ్యూనికేషన్ ఆఫీసర్ కృతిరాజ్ మాట్లాడుతూ సంతోషకరమైన పని వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఎటువంటి రుసుము లేకుండానే సంతోషకరమైన వర్క్‌షాప్‌లను అందించడానికి విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, శ్రామికవర్గాలను చేరుకోవాలన్నారు. సగటు వ్యక్తి దాదాపు 90వేల గంటలు పనిలో గడుపుతున్నాడన్నారు. కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'శిల్పారామం'..

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామం పని చేయు వేళలు ఇవే... ఆదివారం రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. సాయంత్రం 5.30 గంటల నుంచి శిల్పారామంలోని ఆంఫీథియేటర్‌లో సందర్శకుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వృద్ధులకు చేయూతగా..



హఫీజ్‌పేట్ : ఓవైపు ఎండ.. మరోవైపు ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న వృద్ధులను ట్రాఫిక్ కానిస్టేబుల్ అశోక్ కుమార్ చెయ్యి అందించి రోడ్డు దాటించారు. శనివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వద్ద ఓల్డ్ ముంబాయి రోడ్డుపై వృద్ధులు రోడ్డు దాటడానికి అవస్థ పడుతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్ వారిని గమనించి రోడ్డు దాటించడంతో వృద్ధులు కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

మియాపూర్: చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఆర్‌కే హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మధుమేహం, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్, అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరరాజు, మల్లేష్, ఉమ చంద్రశేఖర్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై అవగాహన

శేరిలింగంపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో లక్ష్మీ విహార్ ఫేజ్-2 కాలనీలో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, ప్లాస్టిక్ వాడకం వల్లే కలిగే అనర్థాలను వివరించారు. ఇంకుడు గుంతలను పునరుద్ధరించుకోవాలని, వాటి వలన కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీంద్ర ప్రసాద్ దూబే, కాలనీ ప్రతినిధులు రాజశేఖర్, రాజు, విద్యాసాగర్, రాంసుబ్బారెడ్డి, శానిటరీ రిసోర్స్ పర్సన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్ రోడ్డు విస్తరణలో తీవ్ర జాప్యం

- ఫ్లైఓవర్ నిర్మాణం కోసం తప్పని రోడ్డు మూసివేత
- మండుటెండలో వాహనదారుల అవస్థలు
- పోలీసులకు తప్పని తిప్పలు
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో జీహెచ్‌ఎంసీ విఫలం

గచ్చిబౌలి: ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడం అవసరమైనప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా కొండాపూర్ రోడ్డును మూసివేయడం, ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపందాల్చడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల పాటు మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు ప్రకటించడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. గచ్చిబౌలి జంక్షన్ నుంచి మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు 215 అడుగుల మేర మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. రోడ్డు వెంట ఉన్న నిర్మాణాల యజమానులు ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తీసుకొచ్చి రోడ్డు విస్తరణను ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వస్తున్నారు. ఫలితంగా గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్‌కు వెళ్లే రోడ్డు ఒక్కో వైపు కేవలం రెండు లైన్లు మాత్రమే ఉంది. విస్తరణ చేపడితే ఇప్పుడున్న రోడ్డు రెండింతలు అయ్యే అవకాశం ఉంది. కాని రోడ్డు విస్తరణ చేపట్టకుండా ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొండాపూర్ వైపు సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కోసం రోడ్డును మూసి వేయడం విమర్శలకు తావిస్తోంది. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడంతో వాహనాల రాకపోకలకు వీలు లేకుండా ఉంది.



మెహిదీపట్నం వైపు వెళ్లకుండా బయోడైవర్సిటీ జంక్షన్ రోడ్డు మూసివేత



బయోడైవర్సిటీ నుంచి మాదాపూర్ వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

ఈ రోడ్లలో వెళ్లాలంటే నరకమే..

◆ లింగంపల్లి నుంచి డీఎల్‌ఎఫ్ మీదుగా కొండాపూర్ వైపు, మియాపూర్, కొండాపూర్‌నుంచి వాహనాలు మైండ్‌స్పేస్ జంక్షన్‌కు వెళ్లాలంటే ట్రాఫిక్‌లో గంటల కొద్ది గడపాల్సి వస్తుందని వాహనదారులు గగ్గోలుపెడుతున్నారు. అంతే కాకుండా మెహిదీపట్నం నుంచి వాహనాలు సైబర్‌టవర్ వైపు, సైబర్ టవర్ నుంచి గచ్చిబౌలి వైపు వాహనదారులు ట్రాఫిక్‌లో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మాదాపూర్, కొండాపూర్, శిల్ప లేఅవుట్, బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్, గచ్చిబౌలి వైపు నుంచి వచ్చే వాహనాలతో మైండ్ స్పేస్ జంక్షన్‌లో ట్రాఫిక్ ఆగిపోతోంది.

విస్తరణ మరిచారు..

◆ గచ్చిబౌలి జంక్షన్ నుంచి అంజయ్యనగర్ వరకు 215 అడుగుల రోడ్డు విస్తరణలో రోడ్డుకు రెండు వైపులా 48 నిర్మాణాలతో పాటు కొన్ని ఖాళీ స్థలాలు ఉన్నట్లు జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం గుర్తించింది. ఇప్పటికే 30కి పైగా నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. 27 మంది టీడీఆర్ తీసుకునేందుకు అంగీకరించారు.

◆ మిగిలిన నిర్మాణాలను, ఖాళీ స్థలాలను ల్యాండ్ అక్విజేషన్‌లో చేర్చి నోటీసులు ఇవ్వనున్నారు. జీహెచ్‌ఎంసీ ఆయా విభాగాల అధికారుల సమన్వయం లోపంతో రోడ్డు విస్తరణ ఇప్పటికీ కొలిక్కి రాలేదని చెప్పాలి. ఇప్పటికే నిర్మాణాలకు మార్కింగ్ చేసి, టీడీఆర్ చెల్లించి రోడ్డు విస్తరణ చేపడితే రోడ్డు మూసి వేయాల్సిన అవసరం ఉండేది కాదు. డైవర్షన్‌లతోను పని లేకుండా ఉండేది. ప్రధాన రహదారుల విస్తరణలో నిర్మాణాలు కోల్పోయే వారికి 400 శాతం టీడీఆర్ ఇచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం జీఓ జారీ చేసిన విషయం తెలిసిందే. ఖాజాగూడ జంక్షన్ నుంచి నానక్‌రాంగూడ రోటరీ వరకు ఇదే తరహాలో టీడీఆర్ చెల్లించి మోడల్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని తెలిసీ రోడ్డు విస్తరణ చేపట్టకపోవడం జీహెచ్‌ఎంసీకే చెల్లింది. ట్రాఫిక్ సమస్య కూడా జీహెచ్‌ఎంసీ నిర్వాహకమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసులకు తప్పని తిప్పలు..

◆ గంటలో వందలాది వాహనాలు తిరిగే కొండాపూర్ రోడ్డు మూసివేతతో గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, మైండ్‌స్పేస్, సైబర్‌టవర్ జంక్షన్‌లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సోమవారం నుంచి ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు రోడ్లపైనే విధులు నిర్వహిస్తున్నారు.

◆ ఒక్క మైండ్ స్పేస్ జంక్షన్‌లోనే ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ, ఏసీపీ, లాండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ, ఏసీపీ, సీఐలు ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వహిస్తున్నారు. ప్రధాన జంక్షన్‌లలో ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.

◆ ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాల్చడంతో సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర రంగంలోకి దిగి పలు సూచనలు చేశారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టారు.

డైవర్షన్లతో ఉపశమనం..

◆ సోమ, మంగళవారం నెలకొన్న ట్రాఫిక్ రద్దీతో పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టారు.

◆ గచ్చిబౌలి వైపు నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే వాహనాలు బయోడైవర్సిటీ ఫస్ట్ లెవన్ ఫ్లై ఓవర్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. కింది నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లకుండా జంక్షన్‌ను మూసి వేశారు. గచ్చిబౌలి ఫ్లైఓవర్ కింద యూటర్న్ , మైండ్ స్పేస్ ఫ్లైఓవర్ కింద టీహబ్‌కు వెళ్లే రైట్‌టర్న్ , మైహోం భూజ జంక్షన్లను మూసివేశారు.

◆ ఐకియా రోడ్డులో యూటర్న్, ఇనార్బిట్ మాల్‌కు వెళ్లే రోడ్డులో ఫ్లై ఓవర్‌కింద మరో యూటర్న్‌ను తెరిచారు. శిల్ప లేఅవుట్‌లో మూసివేసిన సిగ్నల్‌లో అన్ని వైపులా వాహనాల రాకపోకలకు అనుమతించారు.

◆ కొండాపూర్‌నుంచి గచ్చిబౌలి వైపు వాహనాలు నేరుగా రాకుండా క్యూమార్ట్ వద్దరోడ్డును మూసివేశారు. సైన్‌బోర్డులు, యూటర్న్‌ల మూసివేత, కొత్తగా యూటర్న్‌లతో కొద్దిగా ట్రాఫిక్‌కు ఉపశమనం కలిగిందనే చెప్పాలి. వర్షం వస్తే గ్రిడ్ లాక్ అయ్యే అవకాశం ఉంది.

◆ ఇప్పటికే కొండాపూర్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. త్వరితగతిన పిల్లర్ల నిర్మాణం చేపట్టి ఒక వైపు వాహనాలను అనుమతించినా కొంత వరకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.



కొండాపూర్ రోడ్డులో ఫ్లైఓవర్ పిల్లర్ల నిర్మాణం కోసం తవ్వకాలు

'ట్రిపుల్ ఆర్' సెంటర్లు ప్రారంభం

మసీదుబండ, రాయదుర్గం, మాదాపూర్‌లలో..



ట్రిపుల్ ఆర్ సెంటరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్, డీసీ వెంకన్న తదితరులు

గచ్చిబౌలి/రాయదుర్గం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలనీలు, బస్తీలలో ట్రిపుల్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్)పేరిట ఏర్పాటు చేసిన సెంటర్లను శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో శనివారం ప్రారంభించారు. మసీదుబండ కమ్యూనిటీహాల్, రాయదుర్గం వార్డు కార్యాలయం, మాదాపూర్‌లోని శిల్పారామం రోడ్‌లో ఈ ట్రిపుల్‌ఆర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిని కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకన్న చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఆర్ సెంటర్లలో ప్రజలు తమ ఇంట్లో ఉపయోగంలో లేని, ఇతరులు వాటిని వినియోగించే స్థాయిలో ఉన్నవాటిని ఈ కేంద్రాలలో పెట్టి రిజిస్టర్‌లో రాయాలని, అలాగే వాటిని వినియోగించుకోవాలనుకునే వారు రిజిస్టర్‌లో తమ అడ్రస్ పేరు రాసి వాటిని తీసుకెళ్ళవచ్చని వివరించారు. అనంతరం ట్రిపుల్ ఆర్ సెంటర్లకు సహకరిస్తామని, సేవ్ ఎనర్జీ, సేవ్ వాటర్ పేరిట ప్రతిజ్ఞను సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి చేయించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ నగేష్, శానిటరీ సిబ్బంది, ఇతర అధికారులు, ఆయా కాలనీ ,బస్తీవాసులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవం



మియాపూర్: చందానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల పూలతో విశేష అలంకారం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

చిత్ర ప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: ఉన్నతమైన ఆశయాలతో విద్యార్థులు ముందుకు సాగాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థులు వేసిన చిత్రాలను శనివారం క్రియేటివ్ హోరిజోన్ పేరిట పెయింటింగ్, ఫొటోగ్రాఫ్స్, ప్రింట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహిస్తున్న సోషల్ వెల్ఫేర్ స్కూల్స్ దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనలో 101 ఆర్ట్‌లను ఉంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐఏఎస్‌లు రాహుల్ బొజ్జా, రోనాల్డ్‌రాస్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రాలను తిలకించిన మంత్రి కొప్పుల ఈశ్వర్

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

మియాపూర్: ప్రజా సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో 52వ రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన బీజేపీ నాయకులతో కలిసి కాలనీల్లో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆరోపించారు.

కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విశాఖపట్నం విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో వినాయక స్తుతి, కృష్ణలీలలు, మహేశ్వరీ, తాండవం, ఆంగికం , నారాయణీయం, రామాయణం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు మోక్షశ్రీ జోషిక, హారికరెడ్డి, తేజశ్రీ, భాగ్యశ్రీ, భువన, అనివ్రత, ప్రీతి హర్షిత, డాక్టర్ దేదీప్యలు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం శ్రీరాజరాజేశ్వరీ కళానిలయం గురువు అనుష్క శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. కళాకారులు వెన్నెల, ఆశ్రిత, ఆరాధ్య, మధుశ్రీ, మానస, టి.సహస్ర, లౌక్య, జస్వంత్, అశ్రిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్.. 9 బైక్‌లు స్వాధీనం




గచ్చిబౌలి: దుకాణాల ముందు పార్కు చేసిన బైక్‌లను తస్కరించే ముగ్గురు దొంగలు కటకటాలపాలయ్యారు. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ రవీందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అస్సాంకు చెందిన జయంత్‌దువ్వార(27), దీప్‌జ్యోతి రాజ్‌కోవా(25), రాజ్ కిషోర్ మిల్లి(30) ముగ్గురు సెక్యూరిటీ గార్డులు. కాగా ఈ ముగ్గురు కొంతకాలంగా దుకాణాల ముందు పార్కు చేసిన బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. వీరు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు బైక్‌లు, రాయదుర్గం పీఎస్ పరిధిలో రెండు, మాదాపూర్ పీఎస్ పరిధిలో రెండు, జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో ఒక బైక్ చోరీ చేశారు. వీరి వద్ద నుంచి తొమ్మిది బైక్‌లను శనివారం గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శప్రాయం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

గచ్చిబౌలి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికి ఆదర్శప్రాయమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్‌వీకె) చైర్మన్ బీవీ రాఘవులు పేర్కొన్నారు. శనివారం రాత్రి గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు తన భూమిని ధారాదత్తం చేశారని, పార్లమెంట్ సభ్యుడైనప్పటికీ సైకిల్‌పై తిరిగాడని ఆయన గుర్తు చేశారు. గచ్చిబౌలిలోని ఎస్‌వీకేలో విద్య, వైద్యం, సాంస్కృతిక రంగాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.మూడు లక్షల పుస్తకాలతో ఆసియాలోనే అతిపెద్ద ప్రైవేట్ లైబ్రరీ గచ్చిబౌలిలోని ఎస్‌వీకేలో ఉందన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో భూమిక నాటక బృందం ప్రదర్శించిన బరిబత్తల రాజు నాటకం ఆకట్టుకుంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులను హాస్య రూపంలో వివరించి నవ్వించారు. కార్యక్రమంలో ఎస్‌వీకే ట్రస్ట్ సభ్యులు ప్రభాకర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎస్‌వీకే ట్రస్ట్ చైర్మన్ బీవీ రాఘవులు

సైబర్ వలలో బీడీఎల్ ఉద్యోగి


క్రిప్టో కరెన్సీ అకౌంట్ పేరిట రూ.4లక్షలకు పైగా మోసపోయిన వైనం

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ బీడీఎల్ ఉద్యోగి నాలుగు లక్షలకు పైగా మోసపోయాడు. భానూర్-బీడీఎల్ ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం.. మండల పరిధిలోని భానూర్-బీడీఎల్ టౌన్‌షిప్‌నకు చెందిన బీడీఎల్ ఉద్యోగి హరిప్రసాద్‌కు ఈనెల 10వ తేదీన వాట్సాప్ ద్వారా వీడియో లైక్ చేసే జాబ్ ఉందంటూ ఓ లింక్ వచ్చింది. దీంతో బాధితుడు లింక్ క్లిక్ చేసి తన వివరాలు నమోదు చేశాడు. అనంతరం వారు బాధితుడిని టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. వచ్చిన వీడియోస్ లింక్స్ చేయమని చెప్పగా, బాధితుడు క్లిక్ చేయగా అతని ఖాతాలో రూ.4 వేలు జమ చేశారు. అనంతరం బాధితుడికి క్రిప్టో కరెన్సీ అకౌంట్ క్రియేట్ చేసుకోమని చెప్పి లింకు పంపారు. అనంతరం ఆ లింకు ద్వారా బాధితుడు వివరాలు నమోదు చేసి అకౌంట్ క్రియేట్ చేసుకున్నాడు. పెట్టిన నగదుకు 30 శాతం కమీషన్ ఇస్తామని నమ్మించారు. దీంతో అప్పటి నుంచి బాధితుడు పలు దఫాలుగా రూ.4,21,000 జమ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు 30శాతం కమీషన్ ఇవ్వాలని బాధితుడు అడగడంతో వారు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు భానూర్ బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు ఏఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉండటంతో స్థానికులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న 35 నుంచి 40 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

యువకుడు అదృశ్యం



అనిల్‌కుమార్ (ఫైల్)

మాదాపూర్: క్యాటరింగ్ చేయడానికి వచ్చిన యువకుడు అదృశ్యమైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం యం.అనిల్‌కుమార్ నాయక్(18) కిష్టారెడ్డి పేట, పటేల్‌గూడ, అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. ఈనెల 11వ తేదీన కొండాపూర్‌లోని అల్ట్రస్ట్ బిజినెస్ హోటల్‌లో కేటరింగ్ చేయడానికి వచ్చి తిరిగి వెళ్ళకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువకుడికి మతిస్థిమితం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.